ప్రభుత్వాలు సీరియస్‌గా స్పందించాలి



కోల్‌కత్తాలో వైద్య విద్యార్థిని హత్య దారుణం. సభ్యసమాజం తలదించుకునే ఘటన. వైద్య వృత్తిలో అందరి ప్రాణాలు కాపాడాలని ఆకాంక్షించే వైద్యులకే రక్షణ లేకపోతే ఎలా.. ప్రస్తుత చట్టాలు ఇలాంటి దాడుల నుంచి కాపాడడంలో విఫలమవుతున్నాయి. ఆ ఘటనతో వైద్య లోకం నివ్వెరపోయింది. ఒకరకమైన భయం ఏర్పడింది. సేవలు అందించేందుకు కూడా భయపడుతున్నారు. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వాలు సీరియస్‌గా స్పందించాలి. అవసరమైన చట్టాలు తీసుకురావాలి.

– సి.యానీగ్రేస్, వైద్యురాలు, నుదురుపాడు పీహెచ్‌సీ



కఠిన చర్యలు తీసుకోవాలి



వైద్యులపై దాడి చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. ఇటువంటి ఘటనలు పునారావృతం కాకుండా తగిన భద్రత పరమైన అంశాలపై దృష్టి పెట్టాలి. వైద్యశాలల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ప్రస్తుతం పట్టణాల్లో ఉన్న ఆస్పత్రుల వద్ద మాత్రమే కొద్దిపాటి భద్రత చర్యలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో అసలే లేదు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి తగిన భద్రత ఏర్పాట్లు చేయాలి. ఇప్పటి కోల్‌కతా ఘటనతో మానసిక ఆందోళన మొదలైంది. తగిన రక్షణ చర్యలు తీసుకోవాలి.

– షరీనాబేగం, వైద్యురాలు, నుదురుపాడు

క్లుప్తంగా

ప్రత్యేక పూజల్లో మంత్రి మనోహర్



తెనాలిరూరల్: పట్టణ వైకుంఠపురంలోని శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరిగిన శిఖర ప్రతిష్ఠామహోత్సవాల్లో రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం పాల్గొన్నారు. ఆలయ అధికారులు, వేదపండితులు స్వాగతం పలికారు. ఆలయ శిఖరంపై కలశాలకు పూజలు చేసి ఆలయ మండపంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి




మంగళగిరి: మాజీ సైనిక ఉద్యోగులకు అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ సైనికుల ఉద్యోగుల వెల్ఫేర్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు శంకర రెడ్డి పేర్కొన్నారు. స్థానిక నిడమర్రు రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశంలో ప్రతినిధులు పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు గుణశీల, కృష్ణారెడ్డి, సాంబశివరావు, రవిబాబు, షేక్ అమస్, రాకేష్ పాల్గొన్నారు.

దివంగత వైఎస్సార్ వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి

వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్రకాష్

తాడేపల్లిరూరల్: ఆరోగ్యశ్రీ ప్రదాత, పేదల పెన్నిధి, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముదిగొండ ప్రకాష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్ర ప్రజల కోసం 108 సేవలు, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. సెప్టెంబర్ 2వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టి.వికాస్ పాల్గొన్నారు.

అర్చకుల వేతనాల పెంపుపై హర్షం



తెనాలిరూరల్: అర్చకుల వేతనాలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై అర్చకులు హర్షం వ్యక్తం చేశారు. గంగానమ్మపేటలోని వేణుగోపాల స్వామి వారి ఆలయ ప్రాంగణంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అర్చక సమాఖ్య నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర అర్చక సమాఖ్య ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.అనంతాచార్యులు మాట్లాడుతూ రూ. 50 వేలకు పైన ఆదాయం ఉన్న ఆలయాల్లోని అర్చకులకు ప్రస్తుతం ఇస్తున్న రూ. 10 వేల వేతనాన్ని రూ. 15 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలకు అర్చక సమాఖ్య తరపున ధన్యవాదాలు చెబుతున్నామన్నారు. అర్చక సంఘ నాయకులు పెనుమూడి సుబ్బారావు, తమిరిశ రమణ ఆత్రేయ, జంధ్యాల గురునాథ ప్రసాద్, వేదాంతం కేశవ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు యత్నాలు విరమించాలి

తెనాలిఅర్బన్: స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రయత్నాన్ని ప్రభుత్వం వెంటనే విరమించాలని సీపీఎం తెనాలి కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. 2000 సంవత్సరంలో బాషీర్‌బాగ్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన అమరుల సంస్మరణ సభను చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆనాడు విద్యుత్ సంస్కరణలో పేరుతో ప్రైవేటీకరణకు చర్యలు తీసుకోవాడాన్ని నిరశిస్తూ పెద్దఎత్తున ఉద్యమం చేయటం జరిగిందని గుర్తు చేశారు. అప్పుడు జరిగిన పోలీసుల కాల్పులలో రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వామిలు మరణించటం జరిగిందన్నారు. సీనియర్ నాయకులు ములకా శివసాంబిరెడ్డి, కె.రవికుమార్, ఎస్.సుబ్రమణ్యం, పద్మ, కళావతి, కె.దుర్గ, గౌజియా, సునీత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పరమ పవిత్రం పర్యూషన్

- 31 నుంచి పర్యూషన్ దినాలు ప్రారంభం
- పవిత్రంగా ఆచరించనున్న జైనులు
- నిబద్ధతతో కూడిన జీవితానికి ప్రతీకలు

తెనాలిరూరల్: అహింసను పరమధర్మంగా భావించేవారు జైనులు. బతుకు...బతకనివ్వు అనే నినాదంతో ముందుకు సాగే జైనులకు పర్యూషన్ ఒక పెద్ద పండుగ. ఈ నెల 31వ తేదీ(శనివారం) నుంచి సెప్టెంబర్ 7వ తేదీవరకు జరగనున్న పర్యూషన్ పర్వదినాలకు పట్టణంలోని జైనులు సన్నద్ధమయ్యారు. జైనులు అత్యంత పవిత్రంగా భావించే పరమ పర్యూషన్ దినాలను శ్రద్ధాభక్తులతో నిర్వహిస్తారు. ఎనిమిది రోజుల పాటు ఆచరించేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు.

ఎనిమిది దినాలూ ప్రత్యేకమే..

ఏటా ఎనిమిది రోజులపాటు జరుపుకొనే ఈ పండుగలో తొలిరోజున సూర్యుడు ఉదయించిన 45 నిమిషాల తర్వాత కాచి చల్లార్చిన నీళ్లు తాగి మరుసటి రోజు వరకు పూర్తి ఉపవాసం చేస్తారు. తిరిగి రెండోరోజు నీళ్లు తాగి ఉపవాసం చేయడాన్ని 'తేల్లా', ఎనిమిది రోజులు చేయడాన్ని 'అట్టయ్' అంటారు. పర్యూషన్ తేల్లా దినాల్లో భాగంగా మూడోరోజు కల్పసూత్ర పఠనం నిర్వహిస్తారు. ఐదోరోజు మహావీర్ స్వామికి పవళింపుసేవ నిర్వహిస్తారు. స్వామిని మననం చేసుకుంటూ ఆయనకు వచ్చిన పద్నాలుగు స్వప్నాల గురించి పఠనం చేస్తారు. పర్యూషన్‌లో భాగంగా జైనుల పవిత్ర గ్రంథం కల్పసూత్రపై వేలంపాట నిర్వహిస్తారు. ఎక్కువ మొత్తానికి దక్కించుకున్న వారి ఇంటికి పవిత్ర గ్రంథాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ గ్రంథ పఠనం చేస్తారు. దీనిని జైనులు అత్యంత ముఖ్యమైనదిగా భావిస్తారు. అదేవిధంగా పాలితణా, సమ్మిత శిఖరజి, శంఖేశ్వర పవిత్రస్థలాల ప్రాముఖ్యతను అక్కడకు వెళ్లివచ్చిన వారు వివరిస్తారు. చివరిరోజు సమర్పణ దినంగా భావిస్తారు.



జైన దేవాలయంలోని మత గురువుల చిత్రపటాలు

ఆలయానికి వెళ్లి స్వామికి పూజలు నిర్వహించి తవు బంధువుల గృహాలకు వెళ్లి, గడిచిన 365 రోజుల్లో ఏదైనా తప్పు చేసి ఉంటే క్షమించమని కోరతారు. తొలిరోజైన శనివారం తెనాలి గంగానమ్మపేటలోని జైన దేవాలయంలో స్వామి వార్ల విగ్రహాలకు అభిషేకాలు నిర్వహిస్తారు.

జైన తీర్థంకరులే దైవాలుగా...

జైన తీర్థంకరులను వీరు పూజిస్తారు. రెండున్నర వేల సంవత్సరాల క్రితం ఆవిర్భవించిన జైనమతంలో 24 మంది తీర్థంకరులు ఉన్నారు. వీరిలో మొదటి వారు రిషబ్‌దేవ్ భగవాన్ కాగా, వర్ధమాన మహావీరుడు 24వ తీర్థంకరుడు. ప్రాపంచిక సుఖ, సంపదలను విడిచి, సన్యసించి, ఇంద్రియాలను జయించి, ఘోర తపస్సుతో కైవల్య జ్ఞానం (భూత భవిష్యత్ తెలుసుకునే జ్ఞానం) పొందిన వారే తీర్థంకరులు. జైనమతం అహింసకే ప్రాధాన్యత నిస్తుంది. రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో జైన దేవాలయాలు ఉన్నాయి. తెనాలి గంగానమ్మపేటలోని మహావీర్ ఆలయం పాలరాతితోనూ, అద్దాల అలంకరణతోనూ విశేషంగా ఆకర్షిస్తుంటుంది. దేవాలయంలోని చింతామణి విశ్వనాథ్, కుంతునాథ్‌ల సమేత వాసపూజ్యస్వామి వార్లను రోజుకో విధంగా అలంకరిస్తారు.



పార్శ్వనాథ్, కుంతునాథ్‌ల సమేత వాసపూజ్యస్వామి

1942లో జైన దేవాలయం నిర్మాణం..

జైనులు తెనాలి వచ్చిన తొలినాళ్లలో ఆధ్యాత్మిక అవసరాల కోసం ఆరాధనాలయాన్ని తాత్కాలికంగా ఏర్పాటుచేసుకున్నా 1942లో జైన దేవాలయాన్ని నిర్మించుకున్నారు. నలభై అడుగుల ఎత్తయిన గోపురం ఈ ఆలయం ప్రత్యేకత. ఇంతటి విశిష్టత రాష్ట్రంలోని మరే ఇతర జైన దేవాలయానికి లేదని చెబుతారు. ఆలయ ముఖ ద్వారం 'అహింసా పరమోధర్మః' సందేశంతో భక్తులకు స్వాగతం పలుకుతుంది.

జైనుల నిబద్ధ జీవితం...

జ్యూయలరీ, పాన్‌బ్రోకర్స్, హార్డ్‌వేర్, వస్త్ర వ్యాపారాలను తమ జీవనానికి ఆలంబనగా చేసుకున్న జైనులు తమ ప్రత్యేకతను లోకానికి చాటుతున్నారు. తెనాలిలో 150 పైగా కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నాయి. మెయిన్ రోడ్డు, గంగానమ్మపేట మధ్యలో వీరు నివసిస్తున్న ప్రాంతాన్ని మార్వాడీ వీధిగా వ్యవహరిస్తుంటారు. ఎక్కువ మంది వెండి, బంగారు ఆభరణాలు కుదువ పెట్టుకుని రుణాలిచ్చే పాన్‌బ్రోకర్ వ్యాపారంలో స్థిరపడగా కొందరు జ్యూయలరీ, హార్డ్‌వేర్, వస్త్ర వ్యాపార రంగంలో కొనసాగుతున్నారు. వీరి జనాభా 1100 వరకు ఉండగా 450 మందికిపైగా ఓటర్లు ఉన్నారు. శ్వేతాంబర జైన మతస్థులైన 'మార్వాడీ'లకు నిత్య జీవితంలో అహింస పరమోత్కృష్ట ధర్మం. మహావీరుని జయంతి, దీపావళి పర్వదినాలను జైనులు ఘనంగా నిర్వహిస్తారు. సూర్యాస్తమయం తర్వాత ఆహారమే కాదు, మంచి నీటిని సైతం వీరు ముట్టకపోవటం విశేషం. దాదాపు అందరు ఉమ్మడి కుటుంబాల్లోనే జీవిస్తారు. రక్తసంబంధం గలవారితో వివాహాలు నిషేధం.

యువత సైబర్ నేరాలపై అవగాహన కలిగిఉండాలి



మంగళగిరి: యువత సైబర్ నేరాలపై అవగాహన కలిగిఉండి వాటికి దూరంగా ఉండాలని ట్రైనీ డీఎస్పీ భార్గవి తెలిపారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన భార్గవి మాట్లాడుతూ టెక్నాలజీ పెరిగే కొద్ది సైబర్ క్రైమ్స్ పెను సవాలుగా మారుతున్నాయని చెప్పారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజ్స్, ఈ మెయిల్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వకూడదన్నారు. ముఖ్యంగా ఓటీపీలను షేర్ చేయరాదన్నారు. పాస్‌వర్డ్ ఎంచుకునే విధానంతో పాటు భద్రపరచుకునే విధానంపై అవగాహన కలిగిఉండాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ బి.పానకాలురెడ్డి, స్నేహ మహిళా మండలి అధ్యక్షురాలు వల్లభనేని వాణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో విద్యుత్ సరఫరా గురువారం నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కల సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ స్తంభాల మార్పు పనుల నిమిత్తం కుంచనపల్లి గ్రామంలోని పోస్టాఫీస్ నుంచి కేఎల్‌యూ కట్ట వరకు ఉన్న రోడ్డులో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

ఎంఈఓ ప్రభాకర్ రావు

పొన్నెకల్లు(తాడికొండ): బడి బయట ఉన్న చిన్నారులందరినీ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ–2 ప్రభాకర్‌రావు సూచించారు. బుధవారం పొన్నెకల్లు ఎస్టీ కాలనీలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలలందరూ బడిలో ఉండాలి– విద్యా ప్రాముఖ్యంపై నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చదువు ద్వారానే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని, విద్య ద్వారా జ్ఞానం, నైపుణ్యం, ప్రతిభ పెంపొందించుకోవచ్చు కనుక ప్రతి ఒక్కరికీ చదువు అవసరం అన్నారు. పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుంది కనుక విద్యార్థులు చిన్న వయసులో చదువుకు దూరం కాకుండా పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. నేడు చిన్న వయసులో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా చిన్నారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పొన్నెకల్లు సెక్టార్ ఐసీడీఎస్ సూపర్ వైజర్ కళావతి హెల్త్ సూపర్ వైజర్ జగదీష్, క్రాప్ జిల్లా కో ఆర్డినేటర్ జి.వెంకట్ పలువురు గ్రామస్తులు, చిన్నారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ ప్రభాకర్‌రావు

దామరపల్లి మొక్కల పెంపకంలో అవినీతిపై విచారణ!

తాడికొండ: మొక్కల పెంపకంలో అవినీతిపై విచారణకు కలెక్టర్ ఆదేశించారు. వివరాలు..

తాడికొండ మండలం దామరపల్లిలోని జగనన్న కాలనీలో మొక్కల పెంపకం చేసినట్లు చూపించి ఉపాధి హామీ పథకంలో రూ.15 లక్షల అవినీతి జరిగిందని, దీనిపై పూర్తిస్థాయి విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. డ్వామా పీడీ కార్యాలయానికి చర్యల నిమిత్తం కలెక్టర్‌కు సిఫార్సు చేయగా విచారణ చేయాలంటూ బుధవారం తాడికొండ ఎంపీడీఓ కార్యాలయానికి ఆదేశాలు అందాయి. తాడికొండ మండలంలోని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మొక్కల పెంపకానికి సంబంధించి గతంలో పలు మార్లు ఆడిట్ అభ్యంతరాలు ఏర్పడ్డాయి, అయితే వారు లోపాయకారీగా వాటిపై ఒప్పందాలు చేసుకొని ఆడిట్ అధికారులను మేనేజ్ చేయడంతో లేనిది ఉన్నట్లు చూపించి టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ప్రభుత్వ ధనం స్వాహా చేశారు. ఇక్కడ టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉద్యోగి 15 సంవత్సరాలకు పైగా సుదీర్ఘ కాలంగా తిష్టవేసి కూర్చుడంటతో నిత్యం ఇదే తంతు కొనసాగుతుంది. దీనిపై పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో పూర్తిస్థాయి విచారణ చేయాలని జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. ఒక్క దామరపల్లిలోనే కాకుండా మండలంలోని పలు ఉపాధి పనులలో కూడా ఆయన చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు ఉన్నాయి.



దామరపల్లిలో మొక్కల పెంచినట్లు చూపుతున్న జగనన్న కాలనీ

శ్రేష్ట రైతు ఉత్పత్తిదారుల సంఘం భేష్

అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్

తెనాలి: రైతులు సంఘటితంగా సంఘాన్ని ఏర్పాటు చేసుకుని సుస్థిర విధానాలతో వ్యవసాయం చేయటం, నాణ్యమైన పంటల ఉత్పత్తులను సాధించటం సంతోషంగా ఉందని గుంటూరు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్ అన్నారు. బుధవారం కొల్లిపర మండల గ్రామాల్లో ఆయన పర్యటించారు. రైతులు సాగు చేస్తున్న వివిధ రకాల పంటలను పరిశీలించారు. ముందుగా కొల్లిపరలోని శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని ఆయన సందర్శించారు. కోల్డ్ స్టోరేజీని, కలెక్షన్ సెంటర్‌ను తిలకించారు. రైతులు పండించిన పసుపు, తదితర పంటలకు విలువ ఆధారిత (ప్రాసెసింగ్) ను జోడించటంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు, నిర్వహణను ఆయన అభినందించారు. మహారాష్ట్రలోని సహయాద్రి సంఘం అంతటి గుర్తింపును తెచ్చుకోవాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. సంఘంలోని రైతులు పసుపు పంట పొలాల్లో వినియోగిస్తున్న సాయిల్ సెన్సార్లను పరిశీలించి, పనితీరును తెలుసుకున్నారు. సంఘం రైతుల వద్ద శిక్షణ తీసుకుంటున్న విజ్ఞాన్ యూనివర్సిటీ, వ్యవసాయ కళాశాల విద్యార్థినులతో మాట్లాడారు. వ్యవసాయ రంగంలోనూ అపారమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. వారు నిర్వహిస్తున్న కార్యకలాపాలను తెలుసుకున్నారు. సమీపంలోని చక్కెరకేళి అరటి, పసుపు ప్లైర్లను పరిశీలించారు. వల్లభాపురంలో సేంద్రియ రైతు వంగా సాంబిరెడ్డి పండిస్తున్న కూరగాయల తోటను చూశారు. తిరిగి కొల్లిపరలో ప్రకృతి రైతు గురుమూర్తి పంట పొలానికి వెళ్లారు. అనుసరిస్తున్న విధానాలను తెలుసుకున్నారు. శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ నెర్ల కుటుంబరెడ్డి, డైరెక్టర్లు వుయ్యూరు సాంబిరెడ్డి, బొంతు గోపాలరెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉద్యాన అధికారి ఉషా పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి

తెనాలిఅర్బన్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని 22వ ఆంధ్రా బెటాలియన్ అధికారి దీపక్ రాజ్‌పుత్ పేర్కొన్నారు. మారీసుపేటలోని ఎన్‌సీఆర్ఎస్ఎం హెచ్ స్కూల్‌లో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే తరాలకు మంచి వాతవరణం అందించాలనే ఉద్దేశంతో ప్రధాన మంత్రి ఏక్ పేడ్–మాకే నామ్ పర్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. అధికారి అక్యుజం చోబా, హెచ్ఎం పీవీ సుధారాణి, ఉపాధ్యాయులు నాగిరెడ్డి, ప్రసాదరెడ్డి, ఎన్‌సీసీ అధికారి స్వామి, సీఆర్ఎంటీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి



అమరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న మస్తాన్‌వలి, యూనియన్ నాయకులు



సంస్మరణ సభలో మాట్లాడుతున్న సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి వెంకటరెడ్డి

తాడేపల్లిరూరల్: విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ 2000లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని బషీరాబాగ్ పోలీసు కాల్పుల్లో మరణించిన విద్యుత్ పోరాట అమర వీరుల త్యాగం అందరికీ స్ఫూర్తిదాయకం అని సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకట రెడ్డి అన్నారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరంలో విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ప్రజలపై విపరీతంగా విద్యుత్ భారాలు వేశారని, వామపక్ష పార్టీలు విద్యుత్ పెంచిన ఛార్జీలకు వ్యతిరేకంగా, ప్రజలపైన వేసిన భారాన్ని తగ్గించాలని చేసిన పోరాటంలో ముగ్గురు అమరులయ్యారని అన్నారు. ప్రస్తుతం కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వ విద్యుత్ చట్ట సంస్కరణలు చేపట్టి ప్రజలపై అధిక విద్యుత్ భారాలు వేశారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్‌కె పాప సాహెబ్, గుడిసె శ్రీనివాసరావు, సయ్యద్ బాషా పాల్గొన్నారు.

ఫిరంగిపురం: విద్యుత్ ఉద్యమంలో అమరులైన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి త్యాగాలు మరువలేనివని సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి అన్నారు. ఫిరంగిపురంలోని పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అమరుల చిత్రపటానికి నివాళులర్పించారు. వారు త్యాగాలు మరువలేనివని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో ఇద్దరు ఎస్ఐలు, ఎనిమిది మంది పీసీలు బదిలీ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ మొత్తం ఖాళీ కానుంది. బుధవారం ఇద్దరు ఎస్ఐలు, ఎనిమిది మంది కానిస్టేబుళ్లకు బదిలీ అయ్యారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు సీఐ, ముగ్గురు ఎస్ఐలు, 54 మంది సిబ్బంది ఉండగా అందులో 20 మంది జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లకు ఎటాచ్‌మెంట్ అయి ఉన్నారు. ప్రస్తుతం 34 మంది మాత్రమే కానిస్టేబుళ్లు ఉండగా అందులో 8 మంది బదిలీ కావడంతో ఆ సంఖ్య 26కు చేరింది. ఇదిలా ఉండగా పెదకాకాని నుంచి నలుగురు కానిస్టేబుళ్లు వస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. బదిలీ అయిన వారిలో ఎస్ఐలు ప్రతాప్, రమేష్, కానిస్టేబుళ్లు విష్ణుమూర్తి, సలీమ్, గంగరాజు, రామకృష్ణ, కొండలు, కళ్యాణ్, సంగీతరావు, నాగ శ్రీను ఉన్నారు.

సాయిబాబా మందిరంలో చోరీ

ఫిరంగిపురం: ఆలయంలోని హుండీ తాళాలు పగలకొట్టి అందులోని నగదు తీసుకెళ్లిన ఘటన మండలంలోని కండ్రిక శివారులోని సాయిబాబా మందిరంలో మంగళవారం అర్ధ రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. బుధవారం ఉదయం ఆలయం వద్దకు వచ్చిన అర్చకుడు శ్రీనివాసాచార్యులకు ఆలయం తలుపులు గడితీసి ఉండటం, లోపల హుండీ తాళాలు పగలకొట్టి ఉండటం కనిపించింది. దీంతో ఆలయ చైర్మన్ చక్కా హనుమంతరావుకు, పోలీసులకు సమాచారం అందజేశాడు. దీంతో క్లూస్ టీం, స్టేషన్ ఏఎస్ఐ మొహిద్దీన్, రైటర్ దాసులు వచ్చి ఆలయ పరిసరాలు, ఆలయం లోపల హుండీ పగలకొట్టిన ప్రాంతాలను నిశితంగా పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పూడికతీత పనులలో అశ్రద్ధ వద్దు

ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా

తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పూడిక తీత పనులలో అశ్రద్ధ వద్దని ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా అన్నారు. బుధవారం వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పనులపై కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. శరవేగంగా పూడికతీత పనులు జరుగుతున్నాయని, పక్కా డ్రైన్‌లతో, కచ్చా డ్రైన్లు, ఔట్‌పాల్ డ్రైన్లు పూడిక తీస్తున్నామని, పూడిక తీసే సమయంలో సచివాలయంలోని శానిటేషన్ ఎమ్యూనిటీలు తప్పని సరిగా ఆ పనులను పరిశీలించాలని ఆదేశించారు. ప్రజలకు పారిశుద్ధ్య సమస్యలు ఏర్పడితే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ నంబర్ 7393912653, 08645–295192 లకు సమాచారం అందజేయాలని అలీం బాషా ఆ ప్రకటనలో కోరారు.